సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 24 । మార్చి । 2023



క్షయ రహితంగా..
క్షయ వ్యాధి రహిత జిల్లాగా మార్చేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంకల్పించింది. ఆ దిశగా పకడ్బందీ చర్యలు చేపట్టింది. 8లో



నేలరాలిన మామిడి
అకాల వర్షాలు మామిడి రైతుకు గుండె కోత మిగిల్చాయి. ఈదురుగాలుల బీభత్సంతో కోలుకోలేని దెబ్బ తగిలింది. 8లో



విశాఖ టు కాశ్మీర్ టూర్
ఐఆర్‌సీటీసీ విశాఖ నుంచి కశ్మీర్‌కు ప్రత్యేక ఫ్లైట్ టూర్ ప్యాకేజీని ప్రారంభించింది. 8లో

రంజాన్ వేళలు

అనకాపల్లి
ఇఫ్తార్ (శుక్ర) 6-12 సహర్ (శని) 4-44

నర్సీపట్నం
ఇఫ్తార్ (శుక్ర) 6-16 సహర్ (శని) 4-43

న్యూస్‌రీల్

మోదకొండమ్మకు వెండి కిరీటం



అమ్మవారికి అలంకరించిన వెండి కిరీటం

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురంలో మోదకొండమ్మ అమ్మవారికి ఆ గ్రామానికి చెందిన బొడ్డేడ సురేష్, భారతి దంపతులు రూ.2.48 లక్షలతో తయారు చేయించిన వెండి కిరీటాన్ని గురువారం సమర్పించారు. మూడు కిలోల బరువు గల ఈ కిరీటాన్ని గ్రామంలో ఊరేగించిన అనంతరం అమ్మవారికి అలంకరించారు. గతంలో సురేష్ కుటుంబ సభ్యులు అమ్మవారికి వెండి బొట్టు, ముక్కుపుడక, హారం, వడ్డాణం సమర్పించారు.

నేడు క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం

అనకాపల్లిటౌన్ : ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక గాంధీనగరం జీవీఎంసీ కల్యాణమండపంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి డాక్టర్ ఎం.శారదాబాయి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. క్షయ వ్యాధిపై అవగాహన పెంచేందుకు గాంధీనగరం కల్యాణమండపం నుంచి నెహ్రూచౌక్ వరకూ ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

కస్తూర్బా విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తులు

అనకాపల్లిటౌన్ : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 20లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన విద్యార్థుల సమాచారాన్ని తల్లిదండ్రుల మొబైల్‌కు అందిస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులు ఏప్రిల్ 26 నుంచి 30లోపు తమ ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేసుకోవాలన్నారు. విద్యార్థి ఆధార్‌కార్డు, విద్యార్హత, విద్యార్థికి తల్లిదండ్రులు లేనట్లయితే వారి మరణ ధ్రువీకరణ పత్రం, కులధ్రువీకరణపత్రం, బడిబయట పిల్లలైతే సంబంధిత ఎంఈవోచే ఓఎస్‌సీ సర్టిఫికెట్ సమర్పించాలని పేర్కొన్నారు.

దూరవిద్య పరీక్ష ఫలితాల విడుదల

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం పరిధిలో 11 పీజీ కోర్సుల మొదటి, రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల చేసినట్లు కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు తెలిపారు. ఎంఏ ఇంగ్లిష్, హిందీ, తెలుగు, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఫిలాసఫీ, మ్యాథమెటిక్స్, ఎంజేఎంసీ కోర్సుల ఫలితాలను www. andhrauniversity. sde.comలో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కోక్ ఓవెన్స్‌లో కూలిన కోక్ బకెట్

గాజువాక: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ ఐదో బ్యాటరీలో కోక్ తీసుకువెళ్తున్న బకెట్ కూలిపోయింది. ఈ సంఘటనలో స్వల్ప ఆస్తినష్టం సంభవించగా అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టం కలగలేదు. ప్రత్యక్షసాక్షుల కథనం మేరకు.. గురువారం విభాగంలో ఎత్తులో ఉన్న ఐదో సీడీసీపీకి బకెట్‌లో వేడిగా ఉన్న కోక్‌ను తరలిస్తున్నారు. కొంత ఎత్తుకు వెళ్లేసరికి బకెట్‌కు ఉన్న రోప్ తెగిపోయింది. దీంతో బకెట్ కింద పడి ధ్వంసమైంది. అందులో ఉన్న హాట్ కోక్ కిందకు పడిపోయింది. దీంతో ఆ ప్రాంతంలో మంటలు వ్యాపించాయి. వెంటనే సీఐఎస్ఎఫ్ ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. బ్యాటరీలో మొత్తం ఐదు బకెట్‌లు ఉండటంతో ఉత్పత్తికి అంతరాయం కలగలేదు. కింద పడిన కోక్‌ను కన్వేయర్ ద్వారా ఉత్పత్తి ప్రక్రియకు పంపనున్నట్టు విభాగం అధికారుల తెలిపారు.

రికార్డు స్థాయి ఉపాధి

జిల్లాలో ఈ ఏడాది రికార్డు స్థాయిలో ఉపాధి పనులు కల్పించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కోటి పనులు కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించగా అంతకు మించి పనులు జరిపి, వేతనదారులకు ప్రభుత్వం అండగా నిలిచింది. భారీ ఎత్తున ఉపాధి పనులు చేపట్టడంతో పల్లెలన్నీ కళకళలాడుతున్నాయి.

- లక్ష్యాన్ని మించి పనిదినాలు
- 2022-23 ఆర్థిక సంవత్సరానికి కోటి పనిదినాలు లక్ష్యం
- ఇప్పటివరకూ 1.07 కోట్లకు పైబడి కల్పన
- ఈ నెలాఖరు నాటికి మరో ఐదు లక్షలు పూర్తి
- ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా కేటాయింపు
- ఒకటి పూర్తయితేనే మరో పనికి అవకాశం

సాక్షి, అనకాపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎన్ఆర్ఈజీఎస్) ద్వారా 2022-23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో పెద్ద ఎత్తున పనులు నిర్వహించారు. ఏడాదిలో నిర్దేశించిన లక్ష్యాన్ని మించి ఉపాధి పనులు కల్పించి రికార్డు సృష్టించారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి గానూ ప్రభుత్వం కోటి పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించింది. ఆ లక్ష్యాన్ని మించి ఇప్పటివరకు 1,07,68,000 పనిదినాలు కల్పించారు. ఈ నెలాఖరు నాటికి మరో 5 లక్షల పనిదినాలను కల్పించనున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా)అధికారులు, ఉపాధి సిబ్బంది కృషితో ఇది సాధ్యమైంది. ఉపాధి పనులకు హాజరైన కూలీలకు జాప్యం లేకుండా పేమెంట్లు కూడా చెల్లిస్తున్నారు. కూలీలు చేసిన పనులకు సంబంధించిన పేమెంట్లు వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ అవుతున్నాయి. ఉపాధి పనుల పర్యవేక్షణకు క్లస్టర్ ఏపీడీలు, ప్రతి మండలంలో ఏపీవో, ఈసీ, టీఏలు అందుబాటులో ఉన్నారు. కూలీలు చేసిన పనులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే విధంగా ప్రతి మండలంలోను ప్రత్యేక సిబ్బంది ఉన్నారు. ప్రతి రోజూ సగటున 30 నుంచి 40 వేల మంది వరకూ కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. దీంతో పల్లెలు ఉపాధి పనులతో కళకళలాడుతున్నాయి.

వ్యవ'సాయం'గా..
గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం చేసే రైతులకు ఉపయోగపడే విధంగా ఉపాధి పనులు చేపడుతున్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి పంట కాలువలు, చెరువులు, చెక్ డ్యామ్‌లు తదితర పనులకు ప్రాధాన్యత కల్పిస్తున్నారు. వారం రోజుల ముందుగా ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా పనులు కేటాయిస్తున్నారు. ఒక పని పూర్తయితేనే మరొక పనికి అవకాశం కల్పించడంతో పాటు పెండింగ్ పనులకు ఆస్కారం లేకుండా డ్వామా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వ్యవసాయ పనులు లేని ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించేలా డ్వామా అధికారులు చర్యలు చేపట్టారు. ఉపాధి పనుల వల్ల గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు చాలా వరకు తగ్గాయి.ప్రస్తుతం వ్యవసాయ పనులు తక్కువగా ఉండడంతో ఉపాధి పనులకు కూలీలు అధికంగా హాజరువుతున్నారు.



నాతవరంలో ఎన్ఆర్ఈజీఎస్ పనుల్లో భాగంగా తీర్చిదిద్దిన చీడిపల్లి కొండయ్య ట్యాంక్

ప్రత్యేక బృందాల పరిశీలన
ఈ పథకంలో ఎటువంటి అక్రమాలకు తావులేకుండా.. ఉపాధి పనులను ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాయి. పనులు జరిగిన తీరు తదితర అంశాలను పరిశీలించి సోషల్ ఆడిట్ నిర్వహించి రికవరీలు చేస్తున్నాయి. అక్రమాలకు ఎవరైనా అధికారుల పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటున్నారు. చేయని పనులు చేసినట్టు నమోదు చేయడం, బిల్లులు చేసిన పనులకు మళ్లీ బిల్లులు చెల్లించడం, కూలీలతో చేయాల్సిన పనులు యంత్రాలతో చేసి వాటికి బిల్లు పెడితే చర్యలు తప్పవని డ్వామా అధికారులు హెచ్చరిస్తున్నారు.



రాంబిల్లి మండలం గోకివాడలో రైతు కొబ్బరితోటలో ఉపాధి పనులు నిర్వహిస్తున్న వేతనదారులు

పనుల వివరాలు ఇలా ...

మొత్తం జాబ్‌కార్డులు	2,84,888
వేతనదారులు	3,00,031
ఇప్పటివరకూ జరిగిన పనిదినాలు	1,07,68,000
రోజుకు సగటు వేతనం	రూ.196.83
సగటున ఒక్కో కుటుంబానికి పనిదినాలు	54
పనుల కోసం కేటాయించిన నిధులు	రూ. 268.13 కోట్లు
ఇప్పటివరకూ ఖర్చు అయినది	రూ.211.95 కోట్లు

కొత్త వారికీ జాబ్‌కార్డులు



అర్హులైన ప్రతి ఒక్కరికీ కూడా జాబ్‌కార్డు అందిస్తున్నాం. కొత్త వారు ఎవరు నమోదుచేసుకున్న వారికీ జాబ్‌కార్డులు కల్పిస్తున్నాం. జిల్లాలో కార్డులున్నవారందరికీ పనులు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ఈ ఆర్థిక సంవత్సరంలో ఒక కోటి పనిదినాలు కల్పించాలనే లక్ష్యం పెట్టుకోగా.. ఇప్పటివరకు 1.07 కోట్లకు పైగా పని దినాలు కల్పించాం. నిర్దేశించిన లక్ష్యాన్ని వంద శాతం పూర్తిచేయడంతో పాటు అదనంగా మరో ఐదు లక్షల పనిదినాలు కల్పించాం. ఈ నెలాఖరి నాటికి మరో ఐదు లక్షల పనిదినాల కల్పనే దిశగా పనులు కల్పించేలా చర్యలు తీసుకున్నాం..

– సందీప్, ప్రాజెక్ట్ డైరెక్టర్, డ్వామా

చిరుధాన్యాలతో ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ ఉషారాణి

అనకాపల్లిటౌన్ : చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, వీటి వినియోగం ఇప్పుడు బాగా పెరిగిందని స్త్రీశిశు సంక్షేమశాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జి.ఉషారాణి తెలిపారు. చిరుధాన్యాల పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా స్థానిక చిన్నవీధి జార్జిస్కూల్ వద్ద గురువారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వచ్చేనెల 3వ తేదీ వరకూ పోషణపక్వాడ కార్యక్రమాలు జిల్లాలోని వివిధప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సజ్జలు, జొన్నలు, కొర్రలు, రాగులు, అరికెలతో తయారు చేసే పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను ఆమె రుచి చూశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి సీడీపీవో పి.ప్రభావతి, సూపర్ వైజర్ నిర్మల పాల్గొన్నారు.

నేడు సెలబ్రిటీ క్రికెట్ సెమీస్ మ్యాచ్‌లు

విశాఖ స్పోర్ట్స్: సెలబ్రిటీ క్రికెట్ లీగ్(సీసీఎల్) సెమీస్ ఫైనల్ పోటీలు శుక్రవారం వైఎస్సార్ స్టేడియంలో జరగనున్నాయి. తొలి సెమీస్ మధ్యాహ్నం 2.30 గంటలకు భోజ్‌పురి దంబాగ్–ముంబై హీరోస్ జట్ల మధ్య జరగనుంది. మరో సెమీస్‌లో రాత్రి 7 గంటలకు కర్నాటక బుల్‌డోజర్స్ జట్టుతో తెలుగు వారియర్స్ జట్టు తలపడనుంది. ఫైనల్స్ శనివారం రాత్రి 7 గంటలకు జరగనుంది. తెలుగు వారియర్స్ జట్టు కెప్టెన్‌గా అఖిల్, మెంటర్‌గా వెంకటేష్ వ్యవహరించనున్నారు. అంబాసిడర్లుగా రెజీ నా, ప్రణీత,ఆదాశర్మ ఉన్నారు. జట్టులో సచిన్‌జోషి, అశ్విన్, ధరమ్, ఆదర్స్, నిఖిల్, తరుణ్, విశ్వ, ప్రిన్స్, సుశాంత్ ఆల్‌రౌండర్లుగా రాణిస్తుండగా నంద, స్మామ్రాట్ బంతితో అలరించనున్నారు. టీ20 మ్యాచ్ అయినా తొలిసారిగా పదేసి ఓవర్లు రెండు ఇన్నింగ్స్‌లుగా పోటీలు జరుగుతున్నాయి. ఈ మ్యాచ్‌లు జీటీవీ ప్రసారం చేయనుంది.

ఈదురు గాలుల బీభత్సం



రావికమతం హాస్టల్ వద్ద నేలకొరిగిన చింతచెట్టు



చింతపాకలో గాలులకు దెబ్బతిన్న అరటితోట

- పలు ప్రాంతాల్లో కూలిన చెట్లు

రావికమతం: మండలంలో గురువారం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. పలు చోట్ల చెట్లు కూలిపోయాయి. మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహం వద్ద భారీ చింత చెట్టు కూలిపోయింది. హాస్టల్ గోడ కొద్దిగా దెబ్బ తింది. టి.అర్జాపురంలో బీఎస్ రోడ్డుపై రెండు తాటిచెట్లు విరిగిపడ్డాయి. ఆ గ్రామానికి చెందిన మత్స్య అర్జున రేకుల షెడ్డు పూర్తిగా పాడైపోయింది. రేకు ఎగిరిపోవడంతో పాటు షెడ్డు ప్రహరీదెబ్బతింది. షెడ్డులోని 200 సిమెంటు బస్తాలు తడిసిపోవడంతో అర్జునకు రూ.2లక్షల వరకు ఆస్తినష్టం జరిగింది. గర్నికం వినాయక ఆలయం వద్ద ఓ చెట్టు విరిగి పడింది.

బుచ్చెయ్యపేటలో
బుచ్చెయ్యపేట: మండలంలో గురువారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వడ్డాదిలో ఎగదాసి గణేష్ అనే వ్యక్తి ఇంటి గోడ కూలింది. సీతయ్యపేట,చింతపాక రోడ్డులో చెట్లు విరిగిపడగా సర్పంచ్ గొలజాన శ్రీను, స్థానికులు వాటిని తొలగించారు. పలు గ్రామాల్లో అరటి,చెరుకు తోటలు నేలకొరిగాయి. జీడిమామిడి కాయలు నేలరాలాయి.

స్థాయీ సంఘంలో 32 అంశాలు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. స్థాయీ సంఘం అజెండాలో 34 అంశాలు పొందుపరచగా, వాటిలో 32 అంశాలు ఆమోదం పొందాయని, మిగిలిన 2 అంశాలు వాయిదా వేసినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. 1 నుంచి 5 అంశం వరకు ఉద్యోగుల సర్వీస్ రూల్స్‌కి సంబంధించి ఆమోదించగా, 6, 30వ అంశాలను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. 7 నుంచి 25వ వరకు రెవెన్యూ విభాగానికి చెందిన వాణిజ్య సముదాయాల లీజుకు సంబంధించి అంశాలు ఆమోదం పొందాయి. అలాగే 26వ అంశమైన టెలీ కాన్ఫరెన్స్ కోసం కొత్త ఏజెన్సీకి టెండరు ఖరారయ్యే వరకు పాత ఏజెన్సీ కొనసాగించేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. 27 నుంచి 29 అంశాలు ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ అదనపు నిర్మాణాలకు రూ.133.08 లక్షలతో అంచనాలకు ఆమోదం తెలిపారు. అలాగే 31 నుంచి 34 వరకు మెకానికల్ విభాగానికి సంబంధించి వాహనాల మరమ్మతులు, ఏడాది పాటు డ్రైవర్ల నియామకానికి ఆమోదం పొందాయి. కార్యక్రమంలో స్థాయీ సంఘ సభ్యులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు కొండంత ఆసరా



మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీఏ సిబ్బంది

- రేపు మూడో విడత నిధుల జమ
- జిల్లాలో 31,925 సంఘాలకు రూ.251.99 కోట్లు
- మూడు విడతల్లో మొత్తం రూ.748.99 కోట్ల లబ్ధి

తుమ్మపాల: వైఎస్సార్ ఆసరా పథకం అక్కచెల్లెమ్మలకు కొండంత భరోసా కల్పిస్తోంది. డ్వాక్రా సంఘాల సభ్యులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేస్తామని ఎన్నికల ముందు జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు ఇప్పటికే రెండు విడతల్లో నగదు జమ చేశారు. ఈ నెల 25న మూడో విడత నిధులను ప్రభుత్వం విడుదల చేయనుంది. ఈ మేరకు గ్రామీణ అభివృద్ధి సంస్థ గత ఏడాది డిసెంబర్ నాటికే అర్హుల జాబితాలను సచివాలయాల్లో అందుబాటులో ఉంచింది. అయితే కొందరు ఒకటి కంటే ఎక్కువ సంఘాల్లో సభ్యులుగా ఉన్నందున బయోమెట్రిక్ తప్పనిసరి చేసింది. వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులతో బయోమెట్రిక్ చేయించారు. ఇలా వివిధ రకాల మార్పులు, చేర్పుల అనంతరం తాజా జాబితాను సిద్ధం చేశారు.

నియోజకవర్గాల వారీగా వివరాలు

నియోజకవర్గం	సంఘాలు	3వ విడత (రూ.కోట్లలో)
అనకాపల్లి	3400	27.30
పెందుర్తి	2614	26.48
మాడుగుల	4891	34.34
చోడవరం	5756	42.66
నర్సీపట్నం	4241	32.52
యలమంచిలి	4436	34.94
పాయకరావుపేట	6587	53.75
మొత్తం	31925	251.99

3,33,635 మందికి లబ్ధి
జిల్లా వ్యాప్తంగా 31,925 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో మొదటి విడతగా 31,746 సంఘాలకు రూ.247.22కోట్లు, రెండవ విడతగా 31,892 సంఘాలకు రూ.249.78 కోట్లు అందాయి. మూడో విడతగా ఈ నెల 25న 31,925 సంఘాల్లోని 3,33,635 మంది సభ్యులకు రూ.251.99కోట్లు జమ కానుంది. మూడో విడత జమయ్యే సొమ్ముతో కలిపి ఇప్పటివరకు మొత్తం వైఎస్సార్ ఆసరా రూపంలో జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు రూ.748.99 కోట్లు అందినట్టవుతుంది.

పది రోజుల పాటు ఉత్సవాలు
ఈ నెల 25న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి స్వయం సహాయక సంఘాల మహిళల ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. 26 నుంచి ఏప్రిల్ 5 వరకు పది రోజుల పాటు వైఎస్సార్ ఆసరా సంబరాలు గ్రామాల్లో సాగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామీణ అభివృద్ధి సంస్థ పర్యవేక్షణలో సంబరాలు ఘనంగా జరిగేలా క్షేత్రస్థాయి సిబ్బందికి సూచనలిచ్చారు. ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ మహిళా సంక్షేమం, జీవనోపాధి కల్పనకు తీసుకుంటున్న చర్యలపై అవగాహన కల్పించే దిశగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది.

25న కలెక్టరేట్‌లో కార్యక్రమం
జిల్లా స్థాయిలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో లాంఛనంగా ప్రారంభించేందుకు డీఆర్‌డీఏ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు.

వారోత్సవాల్లో జీవనోపాధిపై అవగాహన



ఈ నెల 25న స్వయం సహాయక సంఘాల మహిళల ఖాతాల్లో నగదు జమ కానుంది. ఈ మేరకు 25 నుంచి పది రోజుల పాటు గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహించేందుకు సిబ్బందికి మార్గదర్శకాలు జారీ చేశాం. వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా ఇప్పటికే రెండు విడతలుగా నగదు జమ చేశాం. ఇప్పుడు మూడో విడత నగదు జమ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఆసరా వారోత్సవాల్లో మహిళలకు జీవనోపాధిపై అవగాహన కల్పించనున్నాం.

– లక్ష్మీపతి, పీడీ, డీఆర్‌డీఏ

క్లుప్తంగా

పంచలోహ విగ్రహాల ప్రతిష్ట



పంచలోహ విగ్రహాలను అందించిన కళ్యాణ్‌కుమార్ దంపతులు

రావికమతం: కొత్తకోట గుమ్ముడువీధి రామాలయంలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామివారి పంచలోహ విగ్రహాలను గురువారం ప్రతిష్ఠించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు శీలం కళ్యాణ్‌కుమార్, వాణి దంపతులు రూ.1,25,000 వ్యయంతో వీటిని తయారు చేయించి ఆలయానికి బహూకరించారు. ఈ నెల 30న ఆలయంలో సీతారామ కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు.

రంగస్థల నటి సువర్ణకు నట శిరోమణి అవార్డు



రంగస్థల నటి సువర్ణకు నట శిరోమణి అవార్డును అందజేస్తున్న చోడవరం నాట్యభారతి సంస్థ ప్రతినిధులు

చోడవరం: రంగస్థల నటి సువర్ణకు నట శిరోమణి అవార్డు ప్రదానం చేశారు. చోడవరం నాట్య భారతి ఆధ్వర్యంలో ఏటా ఉగాది సందర్భంగా రంగస్థల నటులకు అవార్డులు అందజేస్తారు. ఈ ఏడాది కూడా అవార్డులను అందజేశారు. గురువారం ఏర్పాటు చేసిన అవార్డుల ప్రదానోత్సవంలో ప్రముఖ రంగ స్థల నటుడు ఏఆర్‌జీ శర్మ ఆధ్వర్యంలో కళాకారులను సన్మానించి, సువర్ణకు నట శిరోమణి అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది ఎస్. వరలక్ష్మి, ఉష, వసంత, పాల్గొని అవార్డులను అందజేశారు.

క్షయ రహితంగా..

- జిల్లాలో 9 ట్రీట్‌మెంట్ యూనిట్ల ఏర్పాటు
- ప్రతీ యూనిట్‌లోనూ ఎంవోటీసీ, ఎస్టీఎస్, ఎల్టీ, టీబీహెచ్‌వీ పరీక్షలు
- 2 ఆధునిక సీబీనాట్, 12 ఆర్టీపీసీఆర్ మెషీన్లతో గంట లోపే వ్యాధి నిర్ధారణ
- 25 వ్యాధి నిర్ధారణ కేంద్రాల ద్వారా 1.5 లక్షల మందికి పరీక్షల సదుపాయం
- వెయ్యి మంది రోగులను పారిశ్రామిక వేత్తల దత్తత
- నేడు క్షయ నివారణ దినోత్సవం



క్షయ వ్యాధి నివారణ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు

సాక్షి, అనకాపల్లి: క్షయ వ్యాధి (టీబీ) రహిత జిల్లాగా మార్చేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంకల్పించింది. ఆ దిశగా పకడ్బందీ చర్యలు చేపట్టింది. అంతర్గతంగా పెరుగుతున్న ఈ మొండి వ్యాధి పట్ల మరింత జాగ్రత్తలు తీసుకోకపోతే క్రమేపీ క్షయ పీడితుల సంఖ్య పెరిగే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు జిల్లాలో పలు అవగాహన ర్యాలీలు నిర్వహించనుంది. 2025 ఏడాది నాటికి దేశవ్యాప్తంగా టీబీ రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించడం, సర్వే చేయడం, ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా టీబీ రోగులను గుర్తించి సకాలంలో ఉచితంగా వైద్య అందజేయడం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

చికిత్స విధానం..

అనకాపల్లి జిల్లాలో 9 పరీక్ష యూనిట్లు, 25 క్షయ పరీక్ష కేంద్రాలు ద్వారా మైదాన ప్రాంతంలో లక్ష జనాభాకు, గిరిజన ప్రాతంలో 50 వేలు జనాభాకు సేవలందిస్తున్నారు. ప్రతీ యూనిట్‌లో ఎంవోటీసీ, ఎస్టీఎస్, ఎస్టీఎల్ఎస్, ఎల్టీ, టీడీహెచ్‌వీ అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో రెండు అధునాతన సీబీ నాట్ మెషీన్, 12 కేంద్రాల్లో ఆర్టీపీసీఆర్ యంత్రాలతో గంట వ్యవధిలోనే వ్యాధి నిర్ధారణ అవుతుంది. ఈ వ్యాధి లక్షణాల్లో వచ్చిన రోగులకు, వ్యాధి నిర్ధారణ చేసి 24 గంటలలోపే టీబీ మందులు అందిస్తున్నారు.

డాట్ ప్లస్ చికిత్స ద్వారా..

టీబీ వ్యాధి నిర్ధారణతోపాటు ×డ్రగ్ ససెప్టాబిలిటీ టెస్టింగ్×కి పంపుతారు. దీర్ఘకాలిక క్షయవ్యాధిగ్రస్తులకు (మొండికేసులు) ×డాట్ ప్లస్× చికిత్స అందిస్తున్నారు. టీబీ వ్యాధిగ్రస్తులకు మందులు పూర్తిగా ఉచితంగా అందజేస్తూ ఆర్నెల్ల పాటు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేస్తున్నారు. విముక్తి టీబీ భారత్ అభియాన్‌లో భాగంగా రోగులకు పౌష్టకాహారం అందిస్తున్నారు.

డీబీటీ విధానం ద్వారా..

రోగులకు పోషకాహారానికి రూ.500 అందిస్తారు. రోగం నిర్ధారించినందుకు గానూ ప్రైవేట్ డాక్టర్లకు రూ.వెయ్యి చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. గిరిజన రోగులకు రూ.750 చొప్పున ఇస్తోంది. మందులు వాడించిన వారికి రూ.వెయ్యి చొప్పున ఇస్తోంది.

అవగాహనా సదస్సు...

దేశంలో ఏటా నాలుగు వేల మందికి పైగా ప్రజలు ఈ మహమ్మారి వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. ఇది ముఖ్యంగా ఊపిరితిత్తులకు సోకుతుంది. అయితే శరీరంలోని ఏభాగానికైనా సోకే అవకాశం ఉంది. ఈ వ్యాధి సాధారణంగా ఒకరి నుంచి మరొకరికి గాలి ద్వారా వ్యాపిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు టీబీ సోకకుండా ప్రత్యేక వైద్య బృందం అవగాహన కలిస్తోంది. ఇదే తరహాలో క్షేత్ర స్థాయి ఉద్యోగులు, ఆశ వర్కరు, స్వయంశక్తి సంఘాలకు నిర్వహిస్తున్నారు. వీరికి అదనంగా స్వచ్ఛంద సంస్థల సహకారంతో అవగాహన కల్పిస్తున్నారు. భవ్య ఎన్జీవో భాగస్వామ్యంతో ప్రభుత్వమూ అనుమానిత టీబీ రోగులను గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహిస్తోంది. మేధావులు, రాజకీయ ప్రతినిధులు, యువజన సంఘాలు, ధార్మిక సంస్థలు వారి సహాయ సహకారంతో క్షయను అంత మొందించడానికి ప్రత్యేక కార్యక్రమలు నిర్వహిస్తున్నారు.

జిల్లాలో క్షయ అనుమానిత పరీక్షలు...

- 2015 నుంచి టీబీ స్క్రీనింగ్, నోటిఫై చేయబడిన రోగులు
- గత మూడేళ్లగా వివరాలు ఇలా
- 2021లో 24,810 నమూనాలు పరీక్షించగా... 1984 కేసులు నిర్ధారణ
- 2022లో 44,582 నమూనాలు పరీక్షించగా.. 2249 కేసులు నిర్ధారణ
- 2023లో 6,741 నమూనాలు పరీక్షించగా.. 505 కేసులు నిర్ధారణ

అవగాహన ర్యాలీలు...



ప్రపంచ టీబీ దినోత్సం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి అవగాహన ర్యాలీలు చేపడుతున్నాం. ఇప్పటికే జిల్లాలో వెయ్యి మంది రోగులను కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి, డీఎంహెచ్‌వో హేమంత్‌లతోపాటు పలు అధికారులు, ప్రైవేట్ సంస్థల వారు దత్తత తీసుకున్నారు. పేద వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించాలనుకునే వారు నేరుగా కలెక్టర్ కార్యాలయానికి గానీ, డీఎంహెచ్‌వో కార్యాలయంలోగానీ సంప్రదించవచ్చు. దత్తత తీసుకోవాలనుకుంటే 9849902295 సంప్రదించవచ్చు.

– డాక్టర్ శారదాబాయ్, జిల్లా టీబీ అధికారి

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

- ఇద్దరు దుర్మరణం
- మృతులది శ్రీకాకుళం జిల్లా



ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు (ఇన్‌సెట్) లాడే దుర్గాప్రసాద్

తగరపువలస: వలందపేట వద్ద జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి 12.15 గంటల సమయంలో ఆర్టీసీ బస్సును ఓ కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందారు. రోడ్ సేఫ్టీ పోలీస్ సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా గార మండలం కళింగపట్నానికి చెందిన పట్నాల సంతోష్‌కుమార్(32), రాజరాజేశ్వరిపేటకు చెందిన లాడే దుర్గాప్రసాద్(25) బుధవారం అర్ధరాత్రి విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు కారులో ప్రయాణిస్తున్నారు. జాతీయ రహదారిపై వలందపేట వద్ద ఆగి ఉన్న లారీ, ఆటోను తప్పించే క్రమంలో డివైడర్‌ను ఢీకొని అవతలి రోడ్డు వైపు కారు దూసుకుపోయింది. అదే సమయంలో పార్వతీపురం నుంచి విశాఖ వైపు వస్తున్న రావులపాలెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును కారు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగంగా నుజ్జునుజ్జు కావడంతో డ్రైవింగ్ సీట్లో ఉన్న సంతోష్ కుమార్, పక్కనే కూర్చున్న దుర్గాప్రసాద్ తీవ్రగాయాలతో మృతి చెందారు. వెంటనే పోలీసులు ఫోన్ ద్వారా సంతోష్‌కుమార్ తండ్రి నాగేశ్వరరావుకు సమాచారం అందించారు. రాత్రి 10 గంటల సమయంలో సంతోష్‌కుమార్ ఇంటికి ఫోన్ చేసి శ్రీకాకుళం వచ్చేస్తున్నామని తలుపులు వేయవద్దని కోరినట్టు తండ్రి నాగేశ్వరరావు తెలిపారు. ఇంతలోనే అంత ఘోరం జరిగిపోయిందని మృతుల కుటుంబ సభ్యులు వాపోయారు. భీమిలి సీఐ కె.లక్ష్మణమూర్తి, ఎస్‌ఐ గంటా హరీష్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో సంతోష్‌కుమార్ తండ్రి సిమెంట్ వ్యాపారంలో తోడుగా ఉండగా.. దుర్గాప్రసాద్ పీ అండ్ జీ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాన్ ఫేర్ రెవెన్యూలోనూ వాల్తేరు డివిజన్ ముందంజ

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర) : వాల్తేర్ డివిజన్ నాన్ ఫేర్ రెవెన్యూ (ఎన్ఎఫ్ఆర్) టికెటేతర ఆదాయం ద్వారా రైల్వే బోర్డు నిర్దేశించిన గమ్యాన్ని 10 రోజుల ముందుగానే చేరుకుంది. ఏప్రిల్ 2022–మార్చి 2023గాను నాన్ ఫేర్ రెవెన్యూ ద్వారా రూ.5.52 కోట్లు సంపాదించుకోవాలని వాల్తేర్ డివిజన్‌కు రైల్వే బోర్డు నిర్దేశించింది. అయితే ఈ లక్ష్యాన్ని ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు ఇంకా 10 రోజుల ఉండగానే చేరుకుంది. గత ఏడాది రూ.3.21కోట్లు నాన్ ఫేర్ రెవెన్యూ ద్వారా ఆర్జించగా ఈ ఏడాది రూ.5.51కోట్లు మార్చి నెలాఖరుకు ఇంకా 10 రోజులుండగానే చేరుకుంది. ఇది గతేడాది కంటే 71.65శాతం అధికం. వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ కుమార్ సత్పతి నేతృత్వంలో డివిజన్ బృందం ఆదాయార్జన కోసం చేపట్టిన నూతన ప్రాజెక్టుల వలన ఇది సాధ్యమైంది. వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి నాయకత్వంలో పనిచేసిన అధికారులను డీఆర్ఎం అనూప్ కుమార్ సత్పతి అభినందించారు. భారతీయ రైల్వేలో వాల్తేరు డివిజన్ ఒక రోల్ మోడల్ కాబోతుందని డీఆర్ఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

మద్యం మత్తులో హోంగార్డు హల్‌చల్



కమ్యూనికేషన్ హోంగార్డు గోపి

అల్లిపురం: మద్యం మత్తులో హోంగార్డు ఓ అపార్ట్‌మెంట్‌లోని ప్రవేశించి మహిళలు, వాచ్‌మన్ పట్ల అసభ్యంగా మాట్లాడి బెదిరింపులకు పాల్పడ్డాడు. మహారాణిపేట పోలీసులు తెలిపిన వివరాలివీ.. సూర్యాభాగ్ పోలీస్ మెస్ ఎదురుగా గల రఘు అపార్ట్‌మెంట్‌లోకి పోలీస్ బ్యారక్స్‌లోని కమ్యూనికేషన్ విభాగంలో పనిచేస్తున్న హోంగార్డు గోపి గురువారం మధ్యాహ్నం బైక్‌తో ప్రవేశించాడు. అతనిని వాచ్‌మన్ ప్రశ్నించడంతో గోపి అపార్ట్‌మెంట్‌లోని మహిళలు, వాచ్‌మన్‌పై అసభ్య పదజాలంతో రెచ్చిపోయాడు. నన్నే వెళ్లిపోమంటారా? మీ పని చూస్తానంటూ బెదిరించడంతో.. అపార్ట్‌మెంట్ వాసులు మహారాణిపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు హోంగార్డును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఘాట్ రోడ్డులో అడ్డంగా నిలిచిన లారీ

- రాకపోకలకు అవస్థలు

సాక్షి,పాడేరు: మైదాన ప్రాంతానికి వెళ్లే ప్రధాన ఘాట్‌రోడ్డులోని యేసు ప్రభువు విగ్రహం ఉన్న మలుపులో భారీ లారీ మళ్లీ సాంకేతిక కారణాలతో రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. మైదాన ప్రాంతం నుంచి లోడ్‌తో వస్తున్న భారీ వాహనం ఈ మలుపు ఎక్కలేక మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో మొరాయించి ఆగిపోయింది. బస్సులు, లారీలు, భారీ వాహనాలు ఇరువైపులా నిలిచిపోయాయి. కార్లు, జీపులు, ఆటోలు మాత్రమే రాకపోకలు సాగించాయి. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఆర్టీసీ అధికారులు ఇరువైపులా బస్సులను నిలిపి ప్రయాణికులను తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. లారీని అడ్డంగా తీసే పనులు కొనసాగుతున్నాయి.

సముద్ర తీరం.. పరిశుభ్రం

'సాక్షి'మీడియా ఆధ్వర్యంలో ఆర్.కె.బీచ్ క్లీన్





బీచ్‌రోడ్డు: ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టి.. పర్యావరణాన్ని కాపాడుకుందామని 'సాక్షి'మీడియా విశాఖపట్నం బ్రాంచ్ మేనేజర్ బి.వి.ఎస్.ఎస్.చంద్రరావు పిలుపునిచ్చారు. 'సాక్షి'పత్రిక 15వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఆర్కేబీచ్‌లో బీచ్ క్లీన్ కార్యక్రమం జరిగింది. ఎడిటోరియల్, రిపోర్టింగ్, అడ్మినిస్ట్రేటివ్, యాడ్స్, సర్క్యులేషన్, టీవీ తదితర విభాగాలకు చెందిన సిబ్బంది బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం ఎదురుగా ఆర్.కె.బీచ్‌లో చెత్త, వ్యర్థాలను ఏరివేసి.. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి అందజేశారు. పరిపాలన రాజధాని కాబోతున్న విశాఖ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పిలుపునిచ్చారు.

నేలరాలిన మామిడి

- అకాల వర్షాలతో నష్టం
- రైతులు, లీజుదారుల ఆందోళన



గాలివానలకు రాలిపోయిన మామిడికాయలు

చోడవరం: అకాల వర్షాలు మామిడి రైతుకు గుండె కోత మిగిల్చాయి. ఈదురుగాలుల బీభత్సంతో కోలుకోలేని దెబ్బ తీశాయి. చేతికందిన పంట కళ్ల ముందే నేల రాలడంతో లబోదిబోమంటున్నాడు. ఇప్పటికే మంచు ప్రభావానికి తీవ్రంగా నష్టపోగా, ఇప్పుడు ఉన్న కొద్దిపాటి కాయలు నేల రాలడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. జిల్లాలో వెయ్యి ఎకరాలకుపైగా మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. బుధ, గురువారాలు భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో మామిడి కాయలు చాలా మేర నేల రాలిపోయాయి. చోడవరం, మాడుగుల, నర్సీపట్నం, అనకాపల్లి, పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాల్లో సుమారు రూ.1.50 లక్షల ఎకరాల్లో మామిడి, జీడిమామిడి సాగవుతోంది. పంట ఇప్పుడే కాయదశకు వచ్చింది. ఈ ప్రాంతాల నుంచి ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు మామిడి పండ్లను ఎగుమతి చేస్తుంటారు. దీంతో ఏటా మామిడి పంటపై ఆధారపడి సుమారు లక్ష కుటుంబాలు జీవిస్తున్నాయి. ఈ పరిస్థితిలో గాలివానలకు చేతికందిన పంట నేల రాలడంతో రైతులు, లీజుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాయలు నేల మీద పడి చితికిపోవడం వల్ల అమ్మకానికి పనికిరాని పరిస్థితి ఏర్పడింది. పండిన పంటలో 30 శాతం కాయలుగా గాలివానల బారిన పడటంతో రైతులు చాలా నష్టపోయారు. ఈ నేలరాలిన కాయలు బహిరంగ మార్కెట్‌లో తక్కువ ధరలకు తెగనమ్ముకుంటున్నారు. అడ్డూరు. నర్సాపురం, వి. సంతపాలెం, చోడవరం, గొల్లలపాలెం, రోలుగుంట, రాంబిల్లి, యలమంచిలి, నక్కపల్లి, పాయకరావుపేట, కోటవురట్ల, నాతవరం, నర్సీపట్నం తదితర ప్రాంతాల నుంచి రైతు బజార్లకు రాలిన కాయ భారీగా వచ్చింది. గుట్టలు పోసినంత పంట రాలిపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. సరిగ్గా ఏప్రిల్, మే, జూన్ మాసాల్లోనే మామిడి దిగుబడి, పండ్లు ఎగుమతి జోరుగా సాగుతుంది. ఇలాంటి సమయంలో గాలివానలు, కురవడం, మరో పక్క తుఫాను వర్షాలు తగ్గకపోవడంతో మామిడి రైతు గుండె దిగాలు పడింది. ఇప్పటికే చాలా నష్టపోయిన వీరు తుఫాన్ వర్షాలకు మరింత నష్టపోవాల్సి వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు. మామిడి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

చాలా నష్టపోయా



నేను శీమునాలపల్లి దగ్గర ఆరెకరాల తోటను రూ.2 లక్షలకు లీజుకు తీసుకున్నా. పెట్టుబడికే చాలా ఖర్చయింది. ఇప్పుడేమో పంట చేతికొస్తున్న సమయంలో అకాల వర్షాలకు నేల రాలిపోయింది. ఈ కాయలు పచ్చడికి తప్ప, పండవు. ఈ ఏడాది పెట్టుబడి, లీజు నష్టపోయినట్టే. ఉన్న కొద్దిపాటి కాయ రాలిపోతుందేమోనని భయంగా ఉంది. మామిడి రైతులను, లీజుదారులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

– అప్పలనాయుడు, మామిడి రైతు, అడ్డూరు

ఉత్తమ ప్రదర్శనగా 'కొత్తపరిమళం'

అనకాపల్లిటౌన్: స్థానిక వి.వి.రమణ రైతుభారతి ఓపెన్ ఆడిటోరియంలో జ్యోతిసరళ స్మారక కళా పరిషత్, 1975 ఎంహెచ్ స్కూల్ పూర్వవిద్యార్థుల సహకారంతో నిర్వహించిన ఉమ్మడి ఏపీ ద్వితీయ ఆహ్వాన నాటిక పోటీలు బుధవారం రాత్రితో ముగిశాయి. ఈ పోటీల్లో సర్వాణి గ్రామీణ గిరిజన సేవాసంఘం బొరవంకవారు ప్రదర్శించిన 'కొత్తపరిమళం' నాటిక ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ గుంటూరు వారు ప్రదర్శించిన 'నాన్ననేనొచ్చేస్తా' నాటికకు ద్వితీయ బహుమతి, నటరాజ్ ఆర్ట్స్ క్రియేషన్స్ వైజాగ్ వారు ప్రదర్శించిన 'ది లాస్ట్‌జడ్జిమెంట్' నాటికకు తృతీయ బహుమతి లభించాయి.

'టెన్త్ విద్యార్థులకు ఉచిత ప్రయాణం'

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పదోతరగతి పరీక్షలు వ్రాసే విద్యార్థులు వారి స్వగృహం నుంచి పరీక్షా కేంద్రం వరకూ హాల్ టికెట్స్ చూపించి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని జిల్లా ప్రజా రవాణా శాఖ(ఆర్టీసీ) అధికారిణి కె.పద్మావతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని డిపోల్లో విధులు నిర్వహిస్తున్న తమ సిబ్బందికి ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్టు పేర్కొన్నారు.

పరీక్ష సమయంలో మాత్రమే విద్యార్థులు హాల్‌టికెట్ చూపించి ఆర్టీసీ బస్‌లో ప్రయాణించవచ్చన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

- ముగ్గురు విద్యార్థులకు అభినందనలు



హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పాయకరావుపేట: కృష్ణా జిల్లా గన్నవరంలో జనవరి 13, 14వ తేదీల్లో జరిగిన 37వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలుర పోటీల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు శ్రీప్రకాష్ విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి గురువారం తెలిపారు. శ్రీప్రకాష్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు రాజాన కుమార్, లాలం దిలీప్, దొండా రేవంత్ ఈ నెల 27 నుంచి 31 వరకు అసోం రాష్ట్రం గౌహతిలో జరిగే 37వ జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారని పేర్కొన్నారు. వీరిని విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, ప్రధానోపాధ్యాయుడు డి.వి. శ్రీనివాస్, కోచ్‌లు సురేష్, బాలరాజు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

14 నుంచి విశాఖ టు కాశ్మీర్ టూర్

- ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ఫ్లైట్ ప్యాకేజీ



పహల్గాంలో గల కుంకుమ తోటలు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): పర్యాటకుల కోసం ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) విశాఖ నుంచి కశ్మీర్‌కు ప్రత్యేక ఫ్లైట్ టూర్ ప్యాకేజీని ప్రారంభించింది. ఐఆర్‌సీటీసీ, సౌత్ సెంట్రల్ జోన్ ఏరియా ఆఫీసర్ చంద్రమోహన్ బిసా గురువారం వాటి వివరాలు వెల్లడించారు.

కాశ్మీర్–హెవెన్ ఆన్ ఎర్త్ యాత్ర (5రాత్రులు, 6పగళ్లు)..

ఈ టూర్ ఏప్రిల్ 14న విశాఖలో ప్రారంభమై 19న విశాఖలో ముగుస్తుంది. ఈ యాత్రలో భాగంగా గుల్మార్గ్‌లో గల గొండోల పాయింట్, సోనామార్గ్‌లో గ్లాసియర్, పహల్గాంలో గల మిని స్విట్జర్లాండ్, కుంకుమ తోటలు, అవంతిపుర శిథిలాలు, శ్రీనగర్‌లో దాల్‌లేక్‌లో శికర రైడ్, మొఘల్ గార్డెన్స్, షాలిమార్ గార్డెన్స్, పారి మహల్ వంటి పర్యాటక ప్రదేశాలను వీక్షించే అవకాశం ఉంటుంది. ఒకొక్కరికి సింగిల్ ఆక్యుపెన్సీ బస అయితే రూ.62,660 , డబుల్ ఆక్యుపెన్సీ రూ. 47,480, ట్రిపుల్ ఆక్యుపెన్సీ రూ.46,555 (అన్ని పన్నులు, జీఎస్టీతో కలిపి)

ఈ యాత్ర వివరాలు...

- ఈ యాత్రలకు యాత్రికులు ఎంచుకున్న ఆక్యుపెన్సీ (సింగిల్/డబుల్/ట్రిపుల్) రూంను బట్టి చార్జీ వసూలు చేస్తారు.
- ఇండిగో ఎయిర్‌లైన్, ఎకానమి క్లాస్‌లో విమాన ప్రయాణం
- రాత్రివేళ 3 స్టార్ హోటళ్లలో బస
- విశాఖలో ప్రారంభం మొదలు ఎయిర్‌పోర్ట్ పికప్, డ్రాపింగ్, సైట్ సీయింగ్ అన్ని ఏసీ వాహనాలలోనే..
- ఉదయం అల్పాహారం, రాత్రి భోజనం

ఈ యాత్రలపై మరిన్ని వివరాలకు విశాఖ రైల్వేస్టేషన్ ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద గల ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో స్వయంగా గానీ, విశాలాక్షి-9701085461, చందన్‌కుమార్ - 82879 32318, నంబర్లలో సంప్రదించాలని ఐఆర్‌సీటీసీ ఏరియా ఆఫీసర్ చంద్రమోహన్ తెలిపారు.

క్లుప్తంగా

శ్రీరామనవమికి ఏర్పాట్లు



కల్యాణోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రత్నాకర్, కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం పెదరామ స్వామి ఆలయంలో ఈ నెల 30న జరిగే శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ చెప్పారు. ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. 28న స్వామివారి పెళ్లిరాటోత్సవం, 30న స్వామి కల్యాణ వేడుకలపై సూచనలిచ్చారు. తొలుత సీతారాముల కల్యాణోత్సవ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన నూకాంబిక దీక్షలు



ఊరేగింపులో నూకాంబిక మాలధారణ భక్తులు

అనకాపల్లిటౌన్ : నూకాంబిక అమ్మవారి మాలధారణ భక్తుల మండల దీక్ష గురువారంతో ముగిసింది. అమ్మవారి మాలధారణ సేవా సంఘ వ్యవస్థాపకుడు పాలిమేర శ్రీను ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయంలో భక్తులు ఇరుముళ్లు ధరించి పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ఆలయానికి చేరుకుని అమ్మవారికి ఇరుముళ్లు సమర్పించి దీక్ష విరమించారు. దీక్ష విరమించిన వారిలో మళ్ల గణేష్, సూరిశెట్టి శ్రీను, కోలపర్తి శ్రీను, సూరిశెట్టి ఉదయ్, అక్షయరాజ్, పవన్, కృపాసాగర్, కొండ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కన్నూరుపాలెం, తీడ, ఆనందపురం, చెరకాం, కచ్చర్లపాలెం, ఎల్.కొత్తూరు, చిన్నయ్యపాలెం, జి.భీమవరం, అడ్డాం, అచ్చెర్ల, మోసయ్యపేట, గోకివానిపాలెం, సింగవరం తదితర గ్రామాల్లో వ్యవసాయం, ఇళ్లకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 3,801 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,890	4,110
మొదటి రకం	3,690	3,930
రెండో రకం	3,400	3,700
మూడోరకం	3,060	3,390

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
కోస్టి	సత్యనారాయణస్క్రీన్-1
జాన్‌విక్ (చాప్టర్-4)	సత్యనారాయణస్క్రీన్-2
కబ్జా	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
రంగమార్తాండ	వెంకటేశ్వర
పులి	శ్రీసత్య
దాస్ కా ధమ్కీ	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 32 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-15 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-9 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 364 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 258 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

అభివృద్ధి పథాన.. అనకాపల్లి జోన్

- జగన్ ప్రభుత్వంలో నిధుల కేటాయింపు
- వార్డుల వారీగా పలు అభివృద్ధి పనులు



80వ వార్డులో సీసీ రోడ్డు పనులు



83వ వార్డులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్, కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి(ఫైల్)

అనకాపల్లిటౌన్ : గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో అనకాపల్లి మున్సిపలిటీని పదేళ్ల క్రితం వీలనం చేశారు. ప్రత్యేక జోన్‌గా కేటాయించి, జోన్ పరిధిని ఐదు వార్డులుగా విభజించారు. గత ప్రభుత్వాలు కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించకపోవడంతో జోన్‌లోని వార్డుల్లో సమస్యలు తిష్ట వేశాయి. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తర్వాత కార్పొరేషన్ ఎన్నికలు జరిగాయి. అప్పటి నుంచి జోన్‌లో వార్డులు అభివృద్ధి పథాన పయనిస్తున్నాయి. రూ.కోట్ల నిధులతో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. మరిన్ని పనులు కొనసాగుతున్నాయి.

80వ వార్డులో..

పరవాడ మండలంలో తాడి, సాలాపువానిపాలెం, రాజుపాలెం, వల్లూరు, సిరసపల్లి, కొత్తూరు నర్సింగరావుపేట గ్రామాలతోపాటు పట్టణంలో గవరపాలెం తదితర ప్రాంతాలు రూ.15 కోట్లతో అభివృద్ధికి నోచుకున్నాయి. రూ.5 కోట్లతో అర్బన్ ప్రైమరీ హెల్త్ క్లినిక్, సీసీ రోడ్లు, కాలువలు, తాగునీటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. మరో రూ.10 కోట్లతో వెయ్యి కిలో లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచినీటి పథకాలు, వార్డులోని పలు వీధుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల వంటి కనీస మౌలిక సదుపాయలకు ప్రాధాన్యతనిచ్చారు. ప్రస్తుతం ఈ పనులు తుది దశకు చేరుకున్నాయి.

81వ వార్డులో..

వార్డులో కొబ్బరికాయ, అరటిపళ్ల మార్కెట్‌కు రూ.20 లక్షలతో షెడ్లు నిర్మించారు. బాలాజీరావు పేటలో ప్రజా మరుగుదొడ్లకు రూ.19 లక్షలు వెచ్చించారు. రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం అభివృద్ధికి రూ.50 లక్షలు కేటాయించారు. రూ.90 లక్షలతో నూతన యూపీహెచ్ భవనం నిర్మించారు. వార్డు పరిధిలోని పార్కుల్ని అభివృద్ధికి రూ.5 లక్షలు కేటాయించారు. రూ.30 లక్షలతో కాలువలు, సీసీ రోడ్లు పునరుద్ధరించారు.

82వ వార్డులో..

స్థానిక గాంధీనగరం పార్కును రూ.5 కోట్లుతో తీర్చిదిద్దారు. చిన్నారులు ఆనందంగా గడిపేందుకు వీలుగా పలు సౌకర్యాలు కల్పించారు. విజయరామరాజుపేట వద్ద ఓపెన్ వ్యాయామశాలలో రూ.20 లక్షలతో వ్యాయామ సామాగ్రి సమకూర్చారు. వార్డు పరిధిలో రూ.30 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరిచారు. రూ.40 లక్షలతో అనకాపల్లి-పూడిమడక రోడ్డును కొత్తగా నిర్మించారు.

83వ వార్డులో..

వార్డు పరిధిలో రూ.40 లక్షలతో నూతన రహదారులు, డ్రైనేజీలు నిర్మించారు. ఏఎంసీ కాలనీలో ఉన్న వైఎస్సార్ రాజీవ్ గృహకల్ప నివాసుల సౌకర్యార్థం రూ.20 లక్షలతో వాటర్ ట్యాంకులు నిర్మించారు. యల్లయ్యకాలువపై బ్రిడ్జి నిర్మాణంతోపాటు, రూ.3 లక్షలు వెచ్చించి గ్రిల్స్ ఏర్పాటు చేశారు. గాంధీనగరం సచివాలయ భవనంలో ఓపెన్ వ్యాయామశాలకు రూ.5 లక్షలతో వ్యాయామ సామాగ్రి, చిన్నారుల ఆటవస్తువులు తెచ్చిపెట్టారు. మిరియాలకాలనీలో రూ.70 లక్షలతో నూతన వంతెన నిర్మించారు.



81వ వార్డులో కొబ్బరికాయలు, అరటిపళ్ల మార్కెట్‌కు నిర్మిస్తున్న షెడ్లు

84వ వార్డులో..

కోట్నివీధి, కేఎస్ఆర్.పేటల్లో రూ.2.20 కోట్లతో కొత్తగా రెండు యూపీహెచ్ భవనాలను నిర్మించారు. రూ.కోటి వెచ్చించి రహదారులు, డ్రైనేజీలను పునరుద్ధరించారు. వార్డు ప్రజల అభ్యర్థన మేరకు స్థానిక అవసరాలకు మరో రూ.3 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆమోదం లభించింది. ప్రస్తుతం ఈ పనులు టెండర్ దశలో ఉన్నాయి. త్వరలోనే టెండర్ ఖరారు చేసి, వీటిని పూర్తి చేసేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు.

సమస్యల సత్వర పరిష్కారం



ప్రభుత్వ సహకారంతో వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల్ని కల్పిస్తున్నాం. వార్డు ప్రజల సమస్యల పట్ల సత్వరం స్పందిస్తా. మేయర్, జీవీఎంసీ కమిషనర్ సలహాలు సూచనల మేరకు వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నా.

– కొణతాల నీలిమ, కార్పొరేటర్, 80వ వార్డు

జోన్ అభివృద్ధికి కృషి



గ్రేటర్ విశాఖ విలీన గ్రామాలతోపాటు, పట్టణంలో ఐదు వార్డులున్నాయి. సమస్యల పట్ల కార్పొరేటర్లతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు చేపడుతున్నాం. వారి సహకారంతో జోన్‌లో అభివృద్ధి పనులు చేపడుతున్నాం.

– పి.వెంకటరమణ, జోనల్ కమిషనర్

మేఘం మెరిసెను.. వర్షం కురిసెను

కశింకోట : కశింకోట ప్రాంతంలోని శారదానదిలో గురువారం కొత్తనీరు చేరింది. గత కొద్ది రోజులుగా నది ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల వల్ల ఒండ్రుతో కూడిన నీరు చేరింది. దీంతో గవరపేట ప్రాంతంలో బాతులు నదిలో ఆనందంగా తిరుగాడాయి. జనాలు వీటిని ఆసక్తిగా తిలకించారు. కశింకోట ప్రాంతంలో మధ్యాహ్నం వర్షం కురిసింది. నల్లని మబ్బులు కమ్ముకుని కాసేపు చీకటి వాతావరణాన్ని తలపించింది. అనంతరం కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాల్లో నీరు చేరింది. రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. వర్షం వల్ల ఇక్కడ జరిగిన వారపు సంత నిర్వహణకు అంతరాయం కలిగింది. కొంత సమయం తర్వాత వర్షం తగ్గుముఖం పట్టడంతో సంత కొనసాగింది. ఇదిలా ఉండగా బుధవారం రాత్రి గాలితోపాటు భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డులో నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బంది చెందారు. ఈదురు గాలుల ప్రభావంతో విద్యుత్ సరఫరా నిలిపేశారు. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.



కశింకోట వద్ద శారదానదిలో చేరిన వరద నీటిలో ఈదుతున్న బాతులు

రహదారి భద్రతపై అవగాహన అవసరం

పరవాడ: రహదారి భద్రతపై ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవలసిన అవసరం ఉందని పరవాడ సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు అన్నారు. జేఎన్ ఫార్మాసిటీలో విష్ణు కెమికల్, సువెన్ ఫార్మా పరిశ్రమల్లో గురువారం నిర్వహించిన రహదారి భద్రత అవగాహన సదస్సులో సీఐ మాట్లాడారు. వాహనాలపై రాకపోకలు సాగించే సమయంలో రహదారి భద్రత చర్యలను పాటించడం ద్వారా ప్రమాదాల నుంచి బయటపడవచ్చునన్నారు. కార్లలో ప్రయాణించే సమయంలో సీటు బెల్ట్ ధరించాలన్నారు. వాహనచోదకులు విధిగా హెల్మెట్‌ను ధరించడం ద్వారా ప్రమాదాల నుంచి బయటపడొచ్చన్నారు. రహదారి భద్రతలో ఉద్యోగులు, కార్మికులు, వాహనచోదకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీఐ ఈశ్వరరావు సూచించారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ ఈశ్వరరావు

భగత్‌సింగ్ రచనలు స్ఫూర్తిదాయకం

పరవాడ: భగత్‌సింగ్ రచనలు నేటి యువతకు మార్గదర్శకాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. పరవాడ సినిమాహాలు కూడలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. అనంతరం గనిశెట్టి మాట్లాడుతూ భగత్‌సింగ్ ప్రతి భారతీయుడి గుండెల్లో చెరగని ముద్ర వేసుకొన్నారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్‌సింగ్ చూపిన తెగువ, సైద్ధాంతిక పటుత్వం నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జి.నాయుడు, సీహెచ్.వెంకునాయుడు, బి.శ్రీను, జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

సిద్ధార్థ రెడ్డికి సత్కారం

సబ్బవరం: వైఎస్సార్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిని అనకాపల్లి జిల్లా పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్ మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. తాడేపల్లిలో జరిగిన జిల్లా యువజన విభాగాల అధ్యక్షుల సమావేశం అనంతరం సిద్ధార్థ రెడ్డిని సురేష్‌రాజ్ సత్కరించారు. ఆయనతోపాటు జిల్లాకు చెందిన యువజన విభాగం కార్యదర్శి ఉగ్గిన గంగునాయుడు, నాయకులు జి.రాజేష్, యడ్ల నాయుడు, లగిశెట్టి కుమార్, బోకం బాలు, జెట్టి హేమంత్ కుమార్ తదితరులు ఉన్నారు.



బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిని సత్కరిస్తున్న అనకాపల్లి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సురేష్ తదితరులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని మల్లవరంలో రామాలయంలో టైల్స్ ఏర్పాటు పనులు ప్రారంభించారు. సర్పంచ్ భర్త పిన్నమరాజు గురువారం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చందక శివ, రావి నాయుడుపాల్గొన్నారు.



టైల్స్ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

నేటి నుంచి రంజాన్ దీక్షలు

కశింకోట : మండలంలోని ముస్లింలు పవిత్రమైన రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా శుక్రవారం నుంచి ఉపవాస దీక్షలకు సన్నద్ధమయ్యారు. నెలవంక దర్శనమిచ్చిన మరుసటి రోజు నుంచి ఉపవాస దీక్షలు చేపట్టడం ఆనవాయితీ. గురువారం నెలవంక కనిపించడంతో ఉపవాస దీక్షలు చేపట్టనున్నట్లు స్థానిక ముస్లింలు తెలిపారు. సంప్రదాయంగా రంజాన్ మాసం నెల రోజులు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు దీక్ష నిర్వహించి, సాయంత్రం ఇక్కడి జామియా, నూరి మసీదుల్లో ఉపవాస దీక్షలు విరమించనున్నట్లు పేర్కొన్నారు. నెల రోజుల దీక్షల అనంతరం ఏప్రిల్ 22న రంజాన్ పండగను ఆనందోత్సాహాలతో నిర్వహించనున్నట్లు తెలిపారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట : స్థానిక వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు స్థిరంగా కొనసాగాయి. కిలో ఉల్లిపాయలు, టమాటా, బంగాళాదుంప, వంకాయ రూ.20, బెండకాయ, దొండకాయ, క్యారెట్, బీట్‌రూట్ రూ.40, బీరకాయ, కాకరకాయ, బీన్స్, చిక్కుడు రూ.60, పచ్చి బఠానీ కాయలు, క్యాప్సికం రూ.80, అల్లం రూ.120కి విక్రయాలు సాగాయి.

హరిపాలెం యువకుడికి ఉగాది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న యల్లపు సతీష్

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం గ్రామానికి చెందిన యల్లపు సతీష్‌కు ఉగాది పురస్కారం లభించింది. ఉగాది రోజున హైదరాబాద్‌లో వేదభారతిలో నేచురల్ ఫుడ్స్‌లో ఆధ్వర్యంలో ఈ అవార్డును అందజేశారు. ఈ మేరకు సతీష్‌కు షీల్డ్, పది వేల రూపాయల నగదు అందజేశారు. సతీష్‌కు పురస్కారం లభించడం పట్ల హరిపాలెం గ్రామస్తులు, శ్రీనివాస రైతు క్లబ్ సభ్యు లు అభినందించారు.

మండల కేంద్రానికి చేరిన పది పరీక్షా పేపర్లు



పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పదోతరగతి సెట్-2 పరీక్షా పేపర్లు

సబ్బవరం: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏప్రిల్‌లో నిర్వహించే పరీక్షలకు సంబంధించిన సెట్-2 పరీక్షా పేపర్లు గురువారం సబ్బవరం మండలానికి చేరుకున్నాయి. పరీక్షా పేపర్లను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో పరిశీలించి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. సబ్బవరం మండలంలోని 5 పరీక్షా కేంద్రాలలో నిర్వహించే పరీక్షలకు 1040 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు ఎంఈవో ఎస్.అప్పలరాజు చెప్పారు.

తుమ్మపాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అనకాపల్లి రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. మండలంలోని మేజర్ పంచాయతీ తుమ్మపాలలో గురువారం రూ.24 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రూ.10 లక్షలతో అంబేడ్కర్ నగర్ గ్రామకంఠం భూమిలో పార్కు నిర్మాణంతో పాటుగా చుట్టూ ప్రహరీ, రూ.6 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణ పనులు, మరో రూ.8 లక్షలతో కాలనీలో పాడుబడిన సులాభ్ కాంప్లెక్స్ ఆధునికీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, విల్లూరి చంద్రశేఖర్, పీలా విశ్వేశ్వరరావు, ఆర్టీసీ సత్యనారాయణ, ఉపసర్పంచ్ చదరం చిన్నా, మొగసాల లక్ష్మి, మొగసాల వెంకట్, ఎంపీటీసీలు పన్నీరు వెంకట లక్ష్మి, పన్నీరు చంటి, వార్డు సభ్యులు రవ్వ భవాని, రవ్వ శ్రీను, జెర్రిపోతుల శ్రీలక్ష్మి, వెలగా మోదునాయుడు, తర్ర సత్యారావు, యనమశెట్టి రామారావు, స్కూల్ కమిటీ చైర్మన్ గొంతిన శ్రీను, కంకణాల రాజు, నత్తల ఈశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

అంగన్‌వాడీల్లో చిరుధాన్యాల పోషకాహారం

కశింకోట : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్యకరమైన చిరు ధాన్యాలతో తయారు చేసిన పోషకాహారాన్ని బాలింతలు, గర్భిణులకు అందిస్తున్నారని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని జెట్టపురెడ్డితుని వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు కోరారు. మండలంలోని జెట్టపురెడ్డితునిలో అంగన్‌వాడీ కేంద్రంలో అమలు చేస్తున్న పోషణ్ పక్వాడా కార్యక్రమంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పోషకాహార లోపం ఎదుర్కొంటున్న బాలింతలు, గర్భిణులకు చిరు ధాన్యాలతో తయారు చేసిన పోషకాహారాన్ని అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుచరిత, స్వర్ణప్రియ, అంగన్‌వాడీ, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



పోషణ్ పక్వాడాలో మాట్లాడుతున్న కోన నాగేశ్వరరావు

రాజమండ్రిలో బీసీ సభ రేపు

అనకాపల్లిటౌన్ : పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని, 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గా నరేష్‌యాదవ్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులోని ఓ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 25న ఉదయం 11 గంటలకు రాజమహేంద్రవరంలోని వెంకటేశ్వర ఆనంద కళాక్షేత్రంలో హలో బీసీ.. చలో రాజమండ్రి పేరిట బీసీల సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథిగా సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య హాజరవుతారన్నారు. జనగణనలో కుల గణన జరగాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, పార్లమెంటలో బీసీ మహిళా బిల్లు ప్రవేశపెట్టాలని ఆయన కోరారు. 2024 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీసీల సమస్యలపై ఐక్య పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పిల్లా నివాస్, విల్లూరి బాలాజీ, కశిరెడ్డి నరసింగరావు, యలమంచిలి కార్తీకేయనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దుర్గా నరేష్‌యాదవ్

పేదలకు వస్త్రాల వితరణ

అనకాపల్లిటౌన్ : బడుగు, బలహీన వర్గాల ప్రజలకు తమ సంపాదనలో కొంత సాయం చేస్తే కలిగే ఆనందం చాలా గొప్పదని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం అన్నారు. స్థానిక చిన్నవీధి అసోసియేషన్ ఆధ్వర్యంలో గవరపాలెం నూకాంబిక అమ్మవారి నెల పండగలో భాగంగా గురువారం పేదలకు వస్త్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలతోపాటు, ప్రతి ఒక్కరూ తమ శక్తి కొద్దీ పేదలకు సాయం చేసేందుకు ముందుకురావాలన్నారు. రూ.11 కోట్లతో అమ్మవారి ఆలయం చుట్టూ రాతి కట్టడం, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి అల్లాడ శ్రీనివాసరావు, సభ్యులు రొబ్బి మల్లేశ్వరరావు, కృష్ణమోహన్, చంద్రరావు పాల్గొన్నారు.



పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న బల్లా నాగభూషణం

కొలువుదీరిన దుర్గమాంబ



ఆలయంలో ప్రతిష్ఠించేందుకు దుర్గమాంబ విగ్రహాన్ని తీసుకెళ్తున్న భక్తులు(ఇన్‌సెట్లో అమ్మవారు)

పరవాడ : ఈ.బోనంగి శివారు బొద్దపువానిపాలెంలో నూతనంగా ఏర్పాటుచేసిన దుర్గమాంబ విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ గురువారం వైభవంగా జరిగింది. ఉదయం దుర్గమాంబను భక్తుల దర్శనార్థం గ్రామవీధుల్లో ఊరేగించారు. అనంతరం వేదపండితుల ప్రత్యేక పూజలు, హోమం నడుమ విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ దేవతకు భక్తులు పసుపు కుంకుమలు, సారె, చీరలు సమర్పించారు. ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా చిడతలు, తప్పెడుగుళ్లు, సాముగరిడీలు, నేల డ్యాన్సులు నిర్వహించారు. భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. అన్న సమారాధనలో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు భారీగా పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల్ని పరిష్కరించాలి

అనకాపల్లిటౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నాయని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మద్దాల రాంబాబు అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతిని సేవ్ జర్నలిజం డే పేరిట స్థానిక ఆర్డీవో కార్యాలయం ముందు గురువారం ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వాలు దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. భాస్కరరావు, జోగినాయుడు, మద్దాల కృష్ణ, దేవకి, రవ్వా శ్రీను, రామచంద్రరావు, నటరాజ్, అవతారం పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

సింహాచలం : పెందుర్తి మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వెంకటరావు తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు మండల ప్రజా కార్యాలయంలో ఈసమావేశం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికే సభ్యులందరికీ సమాచారం అందజేసినట్టు వెల్లడించారు.